జ్యోతి కథలపోటీలో

ద్వితీయ బహుమతి పొందిన కథ

# ప్రియురాలి ప్రేమలేఖ

యర్రంశెట్టి శాయి

ప్రియాతి ప్రియమైనరామ్,

ఈ ఉత్తరం ఎవర్రాశారా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? నీకు తెలీకూడదనే నేనూ సంతకం పెట్టలేదు. బహుశా ఈ దస్తూరి చూసి గుర్తించగలవేమో! మనం సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం ఇదే రోజున కలుసుకొన్నాం. ఎక్కడో చెప్పుకోగలవా?

పోనీలే–నేనే చెప్తాను.

ఆ రోజు ఆబిడ్స్ బస్‌స్టాప్‌లో మా క్లాసు పుస్తకాలు పట్టుకొని నిలబడి బస్‌కోసం ఎదురు చూస్తున్నాను. నా పక్కనే నువ్వూ ఒకే ఒక్క నోట్‌బుక్ (నీలం రంగు అట్ట ఉంది. వెనుక షర్మిలా టాగూర్ బొమ్మ) పట్టుకొని నిలబడ్డావు. ఆ రోజు నేను వైలెట్ చారలున్న గ్రీన్ చీర కట్టుకొన్నాను. నువ్వు నల్లగీతలున్న ఊదారంగు పాంటూ, చుక్కల షర్టూ వేసుకొన్నావు. నువ్వు నావేపు రహస్యంగా చూడటం ప్రారంభించేవు. కాని అది నేను గమనించానన్న విషయం నీకు తెలీదు. కొద్దిసేపటి తర్వాత నేను నీవేపు చూశాను. ఇద్దరి చూపులూ కలుసుకొన్నాయి. నువ్వలా చూస్తూంటే నాకు సిగ్గు కలిగింది. వెంటనే మరోవేపుకి చూపులు మరల్చేసుకొన్నాను. ఈ లోగా బస్ వచ్చింది. నేను ఆ బస్ ఎక్కేశాను. లోపల నిలబడి కిటికీలోనుంచి నీవేపు చూశాను. నీ చూపులు ఇంకా నామీదే ఉన్నాయ్.

ఆ చూపుల్లో యెన్నో మూగభావాలు.

ఇంటికి చేరుకొన్నా నీ చూపులు నన్ను వెంటాడుతూనే ఉన్నాయ్. మర్నాడు మళ్ళీ అదే సమయానికి అక్కడ కలుసుకొన్నాము. కొదిసేపు ఇద్దరం అమాయకత్వం నటించాక మళ్ళీ మన చూపులు కలుసుకొన్నాయ్. ఈసారి నేను సిగ్గుపడ్డానుగానీ చూపులు వెంటనే మరల్చుకోలేదు.

కళ్ళు కిందకు దించుకొన్నాను.

"ఈ అమ్మాయ్ కళ్ళు ఎంత బావున్నాయో" అని నువ్వనుకొన్నావు. (అలా అని తరువాత చెప్పావు నువ్వు)

"ఈ అబ్బాయ్ యెంత బాగున్నాడో" అని నేననుకొన్నాను.


సరిగ్గా అప్పుడే నేను వెళ్ళాల్సిన బస్ వచ్చింది. నాకు మొదటిసారిగా బస్ త్వరగా వచ్చినందుకు కోపమొచ్చింది. చిరాగ్గానే బస్ దగ్గరకు నడిచాను. అక్కడ కొంచెం రద్దీగా ఉంది. అదే మరో రోజయినట్లయితే ఆ రష్‌లోనే జొరబడి బస్ ఎక్కేదాన్ని. కాని ఆ రోజు అది సాకుగా తీసుకొని మళ్ళీ వెనక్కు–

తిరిగివచ్చి నీ పక్కన నిలబడిపోయేను. నువ్వు అప్పుడు పొందిన ఆనందం నీ కళ్ళల్లో చూశేను. నాకూ ఓ విధమయిన అనుభూతి —తీయనిది మనసులో నిండిపోయింది.

ఉండుండి ఒకరి వంక ఒకరు చూసుకొంటూ మరి కొద్దిసేపు గడిపాము. ఎన్నో బస్సులు వచ్చిపోతున్న విషయం మనకు తెలీదు. ఎంతోమంది మనిద్దరినీ గమనించి తమదారిన తాము పోతున్న సంగతి కూడా గ్రహించే స్థితిలో మనం లేము.

చీకటిపడిపోయింది.

లైట్లు వెలిగాయి. అప్పుడు నేను స్పృహలోకొచ్చాను. టైము చూసుకొన్నాను. గాబరాపడి బస్ కోసం చూడసాగాను. నువ్వు నవ్వావు. నీకు తెలీకుండా నేనూ నవ్వుకొన్నాను.




బస్ వచ్చేసింది. పరుగుతో వెళ్ళి బస్ ఎక్కేశాను. బస్ స్టార్టు అయాక కిటికీలో నుంచి నీవేపు చూశాను. నువ్వు చిరునవ్వుతో నావేపే చూస్తున్నావు.

"మరికొంతసేపు అక్కడే నిలబడితే ఎంత బావుండేది" అనిపించింది నాకు.

ఆ రాత్రి నాకు భోజనం సయించలేదు. ఆకలంతా ఏమయిపోయిందో తెలీదు. అర్ధరాత్రి

దాటినా నిద్రపట్టలేదు. ఏదో అనిర్వచనీయమైన స్థితి.

తర్వాతిరోజు మా కాలేజీనుంచి బయట పడేసరికి బాగా ఆలస్యమయిపోయింది. నువ్వు వుంటావో వుండవోనని త్వరత్వరగా నడుచుకొంటూ అక్కడికి చేరుకొన్నాను. అంత దూరంనుంచే నిన్ను గుర్తించాను. అంత వరకూ ఆత్రుతగా ఎదురుచూస్తున్న నీ కళ్ళు నన్ను చూడగానే మిలమిల మెరిసాయి. బయటకు పొంగి పొరలుతోన్న నా ఆనందాన్ని అతి



కష్టంమీద అణచుకొన్నాను. నీ పక్కన నిలబడి నీవేపు చూశాను. నువ్వు సన్నగా మందహాసం చేశావు. నేనూ జవాబుగా—కనబడీ కనబడనట్లు—చిరునవ్వు చిందించాను. అంతలోనే సిగ్గు ముంచుకొచ్చి తల తిప్పుకొన్నాను.

ఆ సమయంలోనే నేను వెళ్ళాల్సిన బస్ వచ్చింది.

నా గుండెలు దడదడలాడినయ్. వెళ్ళాలా వద్దా అనే సంశయంలో పడిపోయాను. నేను వెళ్ళకుండా ఉంటే బావుండునని నువ్వూ అనుకొన్నావు. "ఇప్పుడే వెళ్ళకు" అన్న భావం నీ కళ్ళద్వారా నా కందించావు.

నేను కదలలేదు.

అక్కడే నిలబడిపోయేను. బస్ వెళ్ళిపోయింది. నువ్వు ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నావేపు చూశేవు. నాకు మరింత దగ్గరగా జరిగి "మీరు ఎందాకా వెళ్ళాలి?" అనడిగావు.

నేను జవాబు చెప్పలేకపోయాను. చాలా ఎంబ్రేసింగ్‌గా ఫీలయ్యాను.

జవాబుగా నవ్వేసి చూపులు మరల్చుకొన్నాను.

"కొంచదూరం నడచివెళ్దాం రాకూడదూ?" ప్రాధేయపడుతూ అడిగావు.

నా గుండెలు వేగంగా కొట్టుకొన్నాయ్.

ఏం మాట్లాడాలో తెలీలేదు. సిగ్గుతో కుంచించుకుపోయాను. రక్తమంతా నా మొఖంలోకి ప్రవహించింది.

"ప్లీజ్" మళ్ళీ అన్నావు నువ్వు.

మనిద్దరి కళ్ళూ మళ్ళీ కలుసుకొన్నాయ్. నీ కళ్ళలోని ఆకర్షణ నన్ను కట్టివేసింది. 'కాదు' అన్న మాటను లోలోపలే రూపుమాపింది.

అప్రయత్నంగానే తలూపేను. నువ్వు సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యావు.

"పదండి" అన్నావు ప్రపంచాన్ని జయించినంత ఉత్సాహంతో.

అని రెండడుగులువేసి నావేపు చూశేవు.

బిడియంగానే నేనూ కదిలేను.

ఇద్దరం పక్కపక్కనే నడవసాగేము. ప్రవాహంలా ఎదురొస్తున్న జనాన్ని, వాహనాలను ఎలా తప్పించుకొంటున్నామో, ఎలా దాటుతున్నామో మనకి తెలీనే తెలీదు.

కొద్దిదూరం నడిచాక "మీ పేరు చెప్పరూ?" అంటూ అడిగావు.

నేను ధైర్యం తెచ్చుకొని 'లలిత' అన్నాను.

నువ్వు ముగ్ధుడయిపోయావు "నా కెంతో ఇష్టమయిన పేరు" అన్నావు.

మరికొన్ని అడుగులు వేశాము.

"నా పేరు తెలుసుకోరా?" అడిగావు నువ్వు.

నేను నీ వంక చూసి 'చెప్పండి' అన్నాను చిన్నగా నవ్వుతూ.

"శ్రీరామ్" అన్నావు నువ్వు.

"మీరేం చదువుతున్నారు?" అడిగాను నేను.

"బి.కామ్. మరి మీరో?" అడిగావు.

"ఇంటర్మీడియెట్" జవాబిచ్చాను.

అలా మాటాడుకొంటూంటే మనిద్దరికీ గాలిలో తేలిపోతున్నట్లుంది.

"మీ ఇల్లెక్కడ?" అడిగావు.

"మల్లేపల్లి —"

"మా ఇల్లు ఖైరతాబాద్" అన్నావు.

ఇద్దరం నాంపల్లి స్టేషన్‌వరకూ వచ్చేశాము.

"ఇంక నేను వెళ్ళిపోతాను" నువ్వు అక్కడే ఆగిపోవాలన్నట్లు అన్నాన్నేను.

"రేపు కలుస్తారు కదూ?" ఆశగా అడిగావు.

చిరునవ్వుతో తలూపాను.

నేను వెళ్ళిపోతూంటే నువ్వు అక్కడే నిలబడి చెయ్యి వూపావు. నేనూ చేయి ఊపాను.

ఆ రాత్రంతా నాకు ఎన్నో మధురమయిన ఊహలు.

ఆ మర్నాడు ఇద్దరం ఒకే సమయానికి అక్కడ కలుసుకొన్నాం.

"ఇవాళ కాసేపు గార్డెన్‌లో కూర్చుని మాట్లాడుకొందాం, ఏమంటారు?" అడిగావు నువ్వు నవుస్తూ.

"మీ ఇష్టం" అన్నాన్నేను.

ఇద్దరం గార్డెన్ వరకూ నడిచే వెళ్ళాము.

ఎవ్వరికీ కనబడకుండా పూల మొక్కల గుబురులో కూర్చున్నాం ఇద్దరమూ.

"మనిద్దరమూ ఒకరంటే ఒకరు ఎందుకిలా ఆకర్షింపబడ్డాము?" అడిగావు నువ్వు.

"నాకు తెలీదు" నవ్వుతూ జవాబిచ్చాను.

"రాత్రిళ్ళు మీకు నిద్రపడుతోందా?" తిరిగి అడిగారు.

"ఊహూ!"

"నాకూ అంతే! అంతకుముందెప్పుడూ మొద్దునిద్ర పోయేవాడిని. ఆ నిద్రంతా ఏమయిపోయిందో తెలీటంలేదు. మీకు భోజనం సయిస్తోందా?"

"ఊహూ! రెండు ముద్దలు తినేసరికే కడుపు నిండిపోతోంది" నేలమీద చేత్తో గీతలు గీస్తూ అన్నాను.

"అసలు నాకు అది కూడా సయించటం లేదు. మా వదిన గొడవపెట్టేస్తోంది. నేను ఇంకెక్కడో భోజనం చేసి వస్తున్నానని " నవ్వుతూ చెప్పావు నువ్వు.

నా చేతిలోని పుస్తకాలు తీసుకొని తిరగేశావు. ఇంగ్లీష్ టెక్స్ట్ పుస్తకంలో ఆఖరి పేజీలో వున్న నా పేరుకింద శ్రీరామ్ అని రాశావు.

అది చూసి 'అమ్మో' అన్నాను నేను కంగారుగా.

"ఏమిటి" ఆశ్చర్యంగా అడిగావు.

"ఎవరయినా చూస్తే ఇంకేమయినా ఉందా?" ఆందోళనగా అన్నాను.

"పోనీ కొట్టేశెయ్యనా?" ఇబ్బందిగా అడిగావు.

## (వి)చిత్ర విజ్ఞానం



చదరంగం ఆట రష్యాలో రెండవ శతాబ్దంలో పుట్టిందని రష్యా వార్తాపత్రిక ప్రావ్దా పేర్కొన్నది. ఉజ్బెకిస్థాన్‌లోని "డాల్వరిన్ టేపే" అనబడే ప్రదేశంలో పురావస్తుశాఖవారు చదరంగం ఆటవస్తువులను వెలికితీసి యీ వార్త అందించారు. ఈ వస్తువులు మనదేశంలోని చదరంగం ఆటవస్తువులను పోలివుండటం చేత, ఈ ఆట మొదట భారతదేశంలో అంతకు పూర్వమే పుట్టిందని వారి అభిప్రాయం!

---

నాకు ఎందుకో అలా కొట్టివేయడం మనస్కరించలేదు.

"వద్దులెండి" అన్నాను.

అని నీ చేతిలోని పుస్తకం తీసుకొని 'శ్రీరామ్' అన్న అక్షరాల పక్కనే 'లలిత' అని రాశాను.

ఆ పుస్తకం నా చేతుల్లోనుంచి తీసుకొని 'లలిత' అన్న అక్షరాలను ముద్దుపెట్టుకొన్నావు.

నాకు తగని సిగ్గనిపించింది.

చీకటిపడేవరకూ ఇద్దరం తీయని కబుర్లలో లీనమయిపోయాం!

నన్ను మా ఇంటివరకూ పంపి నువ్వు వెనక్కి వెళ్ళిపోయావ్.

ఆ మర్నాడూ అలాగే గడిచిపోయింది.

ఇద్దరం మా ఇంటికి కొద్ది దూరంలో ఆగిపోయాము.

"రేపు ఆదివారం కదూ" అడిగావు.

"అవును!" బాధగా అన్నాను.

"మీ కాలేజీకి శెలవు కదూ?" తెలిసీ అడిగావు.

"అవును."

"మరి మనం కలుసుకొనేదెలా?" బాధగా అడిగావు.

"ఎల్లుండి" కావాలని అన్నాను నవ్వు బిగపట్టుకొంటూ.

"అంతేనా?" నిరాశతో అన్నావు.

ఇంక ఆపుకోలేక నేను నవ్వేశాను.

"మీకేమీ బాధగాలేదూ?" అడిగావు నువ్వు.

నేనేమీ మాట్లాడలేదు.

"పోనీ రేపు మధ్యాహ్నం బయటకు రాకూడదూ?" అడిగావు.

"ఎందుకు?" ఆశ్చర్యంగా చూశాను.

"....అలా కాసేపు తిరుగుదామని..."

నా మనసులో ఉన్న కోరికా అదే. కానీ కొంచెం బెట్టుచేశాను.

"ఊహు! కుదరదు" అన్నాను.

నువ్వు కృంగిపోయావ్.

"ప్లీజ్! లలితా! మిమ్మల్ని చూడకుండా ఉండలేను" అన్నావు బ్రతిమాలుతూ.

"సరే" అన్నాను జాలి తలచినట్లు.

మర్నాడు ఇద్దరం మళ్ళీ ఆబిడ్స్ బస్ స్టాండ్‌లో మధ్యాహ్నం రెండింటికి కలుసుకొన్నాం.

ఇద్దరం ఆ పక్కనే ఉన్న థియేటర్‌లో సినిమా కెళ్ళాం.

ఆ సినిమా ఏమిటో నీకు గుర్తుందనుకొంటాను. 'వాగ్దానం'.

అందులోని ప్రేమ దృశ్యాలు మనిద్దరినీ మరింత దగ్గర చేసినయ్. అంతవరకూ లోపల

దాగివున్న అనుభూతిని బయటకు లాగినయ్. మనకు తెలియకుండానే నా చేయి నీ చేతుల్లోకి చేరుకొంది.

ఎంత అద్భుతమయిన స్పర్శ అది. ఎంత మరపురాని అనుభూతి అది. నువ్వు నా కళ్ళ ల్లోకి చూశావు. నేనూ నీవైపే చూశాను. ఆ తరువాత మనం సినిమా చూడలేదు. మన కళ్ళల్లో దాగుకొన్న మధురమయిన ఊహల్ని కళ్ళద్వారానే కథలుగా చెప్పుకొన్నాం.

సినిమా హాలునుంచి బయటికొచ్చి టాంక్ బండ్ మీద పార్కులో కూర్చున్నాం.

నేను నీ వళ్ళో తలపెట్టుకొని పడు కొన్నాను. నువ్వు నా పెదాలమీద వద్దులే! ఆ తరువాతేం జరిగిందో నీకూ తెలుసుగా.

ఆ తరువాత ప్రతిరోజూ పార్కులోనే కలుసుకొనేవాళ్ళం.

"ఇకనుంచీ నన్ను 'మీరు' అనొద్దు" అడి గాను నేను.

"మరి నన్నుకూడా 'నువ్వు' అనే అనాలి" షరతు పెట్టావు నువ్వు.

ఇద్దరం మోకాళ్ళమీద తలపెట్టుకొని ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తూ ఎన్ని రోజులు గడి పాము?

"జీవితాంతం యిలా నీ కళ్ళలోకి చూస్తూ నన్ను నేనే మరచిపోగల అదృష్టం లభి స్తుందా లలితా అంటూ" నువ్వడిగావు ఒకరోజు.

"నీ గుండెలమీద వాలిపోయి సర్వం మరిచి పోవడమే నేను కోరుకొనేది" అన్నాను నేను.

ఇద్దరం నవ్వుకొన్నాము. కబుర్లు చెప్పు కొన్నాము. ఒకరిమీద ఒకరం అలిగాము. ఒకరినొకరు స్పర్శించుకొన్నాము. కౌగలించు కొన్నాము.

ఎన్ని సాయంత్రాలలా గడిచిపోయాయ్?

నువ్వు బి. కామ్. పాసయ్యావు. నేనూ ఇంటర్మీడియెట్ పాసయ్యాను.

నువ్వు ఉద్యోగాన్వేషణలో పడ్డావు. మా వాళ్ళు నా చదువు మానిపించి వివాహ ప్రయ త్నాలు చెయ్యటం మొదలుపెట్టారు.

ఆ విషయం చెప్తే నువ్వు నవ్వావు.

"వివాహం మనిద్దరి కిరాసిపెట్టి ఉంటే వేరే సంబంధా లెందుకు చూస్తున్నారు?" అనడి గావ్.

నేనూ నవ్వేశాను.

మరికొన్ని రోజులు గడిచిపోయాయ్. మన మధ్య దూరాన్ని ప్రేమలేఖలు దగ్గర చేసి నయ్. అదివరలా ప్రతిరోజూ కలుసుకోలేకపోవ డంతో మనిద్దరికీ అశాంతిగానే ఉంది.
కలుసుకొన్న కొద్దిసేపూ మళ్ళీ విడిపోతామన్న బెదురులోనే గడిపేవాళ్ళం.

"విరహముకూడా సుఖమే కాదా" అన్న పాటలోని నిజాన్ని మనం అప్పుడు చవి చూచాము.

"ఇంకెన్నిరోజులు! మరో నెలరోజుల్లో నాకు ఉద్యోగం వచ్చేస్తుంది. అప్పుడు మనం మనపెద్దాళ్ళు వప్పుకొన్నా లేకపోయినా వివాహం చేసుకొందాం" అన్నావు నువ్వు.

ఆరోజుకోసరమే ఇద్దరం కళ్ళల్లో వత్తు లుంచుకొని ఎదుర్చూడసాగాము.

ఆ ఏడు దీపావళిపండుగ నీకు గుర్తుందా?

ఇద్దరం ఎలాగోలా మధ్యాహ్నమే ఇంట్లో నుంచి తప్పించుకొని, లోకల్ ట్రైన్‌లో ఉందా నగర్ వరకూ వెళ్ళాం. తిరిగి అదే లోకల్‌లో వచ్చేటప్పుడు చీకట్లో—ఇంకెవరూ లేని ఆ కంపార్టుమెంటులో కాకరపువ్వొత్తులుకాల్చాం. ఆ వెలుగులో ఒకరినొకరు చూచుకొంటూ మైమరచిపోయాం. ప్రతి దీపావళీ అంతటి ఆనందం. అంతటి ఉత్సాహంతో ఆ పండుగ జరుపుకోవాలని నిర్ణయించుకొన్నాం. అందరూ దీపావళి చేసుకొంటూంటే చేతిలో చెయ్యేసు కొని చూస్తూ వీధులన్నీ తిరిగేము.

"మా ఇంట్లోవాళ్ళు నాకు ఓ సంబంధం నిశ్చయం చేశారు. ఆ విషయం చెప్పి నేను కన్నీరు పెట్టుకొన్నప్పుడు, నీకూ కన్నీరాగ లేదు. అప్పుడు నా కన్నీళ్ళు తుడిచేస్తూ నువ్వే మన్నావో గుర్తుందా?

"పిచ్చి లలితా! మీవాళ్ళు నిశ్చయించినంత మాత్రాన ఆ పెళ్ళి అయిపోతుందనుకొంటు న్నావా? నే నెవరో తెలుసా? పృథ్వీరాజుని.

## (వి) చిత్ర విజ్ఞానం



మలేరియా మనదేశంలో మళ్ళీ విజృంభించింది. ఈ వ్యాధి వ్యాప్తికి తోడ్పడే అనాఫిలిస్ దోమల జనాభా చెప్పనలవికానంత వేగంతో పెరిగిపోతున్నది. అనాఫిలిస్ దోమను నిర్మూలించేందుకు అమెరికాలోని ఎల్‌సాల్వడార్ శాస్త్రజ్ఞులు ఇ-ఎన్-టి 61585 అనే మందును కనుగొన్నారు. ఈమందు చల్లితే దోమల జననేంద్రియాలు నశించిపోతాయట!

---

నువ్వు రాణీ సంయుక్తవు. అర్థమయిందా?" అడిగావు నవ్వుతూ.

అప్పుడు నా కెంత ఆనందం కలిగిందని?

"ఇదిగో! ఇదే ఆఖరుసారి నీ కన్నీళ్ళు చూడటం! మరోసారి నువ్వు కన్నీరు పెట్ట కూడదు. పెట్టనీను. నువ్వు ఏం చేసినా నేను సహించగలను గానీ కన్నీరు మాత్రం చూడ లేను. దయచేసి ఏడవకు" అంటూ నన్ను నీ గుండెలకు హత్తుకొని ఊరడించావు.

"మన జీవితమంతా నవ్వులమయం కావాలి. ప్రతిక్షణం రసవత్తరంగా ఉండాలి. ఇప్పుడు పొందుతున్న ఆనందానికి యెన్నో రెట్లు ఎక్కువ అనుభవించాలి" అన్నావు నా చెవిలో.

అవి నా శరీరానికి యెంత గిలిగింతలు కలిగించిందీ నీకూ తెలుసు.

ఆ మాటలు నన్నే లోకాలకు తీసుకు పోయిందీ నా కింకా గుర్తుంది.

నీకు ఉద్యోగం దొరికింది.

ఆ రోజు యెంత హడావిడి చేశావ్ నువ్వు. ఎంత గొడవయిపోయింది?

సరాసరి మా యింటికొచ్చేశావ్. మా నాన్న గారిని కలుసుకొని మనిద్దరం స్నేహితులమనీ, వివాహం చేసుకోవాలనుకొంటున్నామనీ చెప్పావు. ఆయన ఖంగారుపడిపోయారు. అమ్మ నన్ను నిగ్గదీసింది.

"నా కున్న పుద్యోగంతో లలితను పోషించుకోగలను. మీరు ఆశీర్వదించి మమ్మల్ని ఒకటి చేయాలి" అనడిగావు.

వాళ్ళు మీ కులం యేమిటని నిన్ను అడిగారు.

"మేము మనుషులం! మీరూ మనుష్యులే కనుక మనది ఒకే కులం" అన్నావు నువ్వు.

అమ్మ వప్పుకోకపోయినా నాన్నగారికి నువ్వంటే ఇష్టం కలిగింది. కట్నాలివ్వలేక వదులుకొన్న సంబంధాలు ఆయనకు గుర్తున్నాయ్. అందుకే వెంటనే అంగీకరించారు.

ఆ రోజే మనిద్దరం మీ ఇంటికి వెళ్ళాం. నన్ను బయటి గదిలో కూర్చోబెట్టి నువ్వు లోపలకెళ్ళావ్! మీ వదినను తీసుకొచ్చి నన్ను చూపించేవు.

ఆమె నిర్ఘాంతపోయింది నన్ను చూసి.

"ఎవరీ అమ్మాయ్?" అనడిగింది నిన్ను. తేరుకొని—

"మీ ముద్దుల మరిదికి ప్రియురాలు" అని చెప్పావు నీవు నవ్వుతూ.

ఆమె ఆశ్చర్యపోయింది.

"అయితే—వాళ్ళూ వీళ్ళూ నీ గురించి చెప్పినవన్నీ నిజమేనన్నమాట" అంది నా దగ్గరకొస్తూ.

నేను ఆమెకు నమస్కరించాను.

"నీ పేరేమిటి?" నా చేయి పట్టుకొని లోపలికి తీసుకెళ్ళి మంచంమీద కూర్చోబెట్టి తనూ నా పక్కన కూర్చుంది.

పేరు చెప్పాను.

ఎన్నో వివరాలడిగింది. అన్నీ వినయంగా చెప్పాను.

ఆ తరువాత మావాళ్ళు మీ ఇంటికి రావడం-అన్నీ మాట్లాడుకోవటం-పది రోజుల తరువాత మన వివాహం నిశ్చయింపబడటం, వెంటనే జరిగిపోయాయ్.

రేపు 'పెళ్ళి' అనగా ఇవాళ మనం కలుసుకున్నాము. ఆ రోజంతా ఎక్కడెక్కడ తిరిగామో, ఎంత ఆనందం అనుభవించామో మన ఆఖరి క్షణాలవరకూ మర్చిపోలేము.

"లలితా! నీ కివాళ మాట ఇస్తున్నాను. మనం ఇన్నిరోజులు ఎలా ఆడుతూ పాడుతూ గడిపామో-వివాహమయిన తర్వాత ప్రారంభమయే జీవితంకూడా అలానే గడుపుతాము. ఈ రోజు నేను నిన్నెలా ఆరాధిస్తున్నానో జీవితాంతం నిన్నలాగే ఆదరిస్తాను. అలాగే నువ్వూ ఎన్ని సమస్యలొచ్చినా, ఎన్ని కలతలెదురయినా నీ చిరునవ్వు వాడిపోదని హామీ ఇవ్వాలి. ఇప్పటివరకూ నా పట్ల నువ్వు చూపుతున్న అనురాగం జీవితాంతంఇలాగే చిగురిస్తూండాలి."

అన్నావు నువ్వు చెయిజాపుతూ.

నీ చేతిలో చేయి వుంచాను నేను.

ఆ క్షణాలు ఎంత పవిత్రమయినవి? ఆ ఆరాధన, ఆ అనురాగం, ఆ అభిమానం ఎంత గొప్పవి.

ఎలా మర్చిపోగలం ఆ రోజుని.

వివాహం అయింది.

ఇద్దరం సంసారం ప్రారంభించాము. ఎన్నో రోజులు మనం ఊహించిన ఊహలకన్న మధురంగా గడచిపోయాయ్.

మనకిద్దరకూ మరో ఇద్దరు పాపాయిలు తోడయారు.

మనం ఎదురుచూడని సమస్య లెదురొచ్చినయ్. కష్టాలు కమ్ముకొన్నయ్.

ఇబ్బందు లెక్కువయ్యాయ్.

చాలీచాలని జీతాలు, పెరిగిన సంసారం, బాధ్యతలు, చిక్కులు, చిక్కు సమస్యలు—

ఇవన్నీ మన ఆనందానికి అడ్డుతగలటం మొదలయింది.

నువ్వు నాకిచ్చిన హామీని మర్చిపోయావు.

నేను నీకు చేసిన బాసలు నిలబెట్టుకోలేక పోయాను.

మనిద్దరిమధ్యా ఆనాటి ఆరాధన లేదు. అనురాగం మాసిపోయింది. చిరునవ్వులు వాడిపోయాయి. నవ్వుతూ, తుళ్ళుతూ, పరవశిస్తూ చెప్పుకొనే కబుర్లు, ఆడుకొనే ఆటలు, చిరుకోపాలు, అలకలు, అలుపులు, సరదాలు, సంతోషాలు, పరిహాసాలు—క్రమేపీ ఎందుకు కరువయిపోయాయ్?

శ్రీరామ్!

నేను నీ లలితను.

ఆనాడు బస్‌స్టాప్ దగ్గర పరిచయమయిన లలితనే!

"నీ కళ్ళు ఎంత బావుంటాయ్" అన్న శ్రీరామ్‌వి నువ్వేకదూ!

"ఇలా నీ వళ్ళో పడుకొని ఎన్ని యుగాలయినా గడిపేయగలను" అన్న శ్రీరామ్‌వేనా నువ్వు?

"నా చిరునవ్వు ఎప్పటికీ వాడిపోకూడదనీ, కలకాలం నేను నీ ఇంట్లో నవ్వుతూ పాడుతూ ఉండాలని" బాసలు చేయించుకొన్న నా శ్రీరామ్‌వే కదూ నువ్వు?

ఇవన్నీ ఎలా మర్చిపోగలిగావు శ్రీరామ్?

వద్దు శ్రీరామ్ వద్దు!

నేనిక భరించలేని జీవితం.


నాకు రుచికరమయిన భోజనం అవసరం లేదు. ఖరీదయిన బట్టలు నేను కోరటం లేదు. ఇంద్రభవనం లాంటి ఇల్లూ నా కొద్దు. కార్లూ, స్కూటర్లూ ఇవన్నీ నా కనవసరం.

నన్ను పస్తులుంచు నేను సహిస్తాను.

నన్ను కటిక దరిద్రానికి గురిచేయి. ఆనందంగా సహిస్తాను.

నన్ను అష్టకష్టాలూ పెట్టు. చిరునవ్వుతో స్వీకరిస్తాను.

కాని శ్రీరామ్!




నాకు ఆనాడు ఆబిడ్స్ బస్‌స్టాండ్‌లో మనం అనుభవించిన తీయని అనుభూతిని మళ్ళీ ప్రసాదించు.

ఆనాడు గార్డెన్‌లో నా ఇంగ్లీష్ టెక్ట్స్‌లో ఆఖరి పేజీమీద నీ పేరు రాసి కలిగించిన థ్రిల్ మళ్ళీ కలిగించు.

ఆ రోజు టాంక్‌బండ్ పార్క్‌లో నా పెదాల మీద ముద్దుపెట్టుకొని కలిగించిన గిలిగింతలు నాకు మళ్ళీ కావాలి.

ఆ రోజు మొదటిసారి సినిమా కెళ్ళినప్పుడు నా చేతిని నీ చేతుల్లోకి తీసుకొన్నప్పుడు కలిగిన గగుర్పాటుని దూరం చేయకు.

ఆ రోజుల్లో నన్ను నీతో పాటు నడిపించి, ఎన్నో తీయని కబుర్లు చెప్పి, కథలు వినిపించి, పరిహాసాలు చేసి, నాకు కలిగించిన ఆనందం, ఆకర్షణ, పరవశత్త్వం నాకు తిరిగి అందించు.

ప్రతిక్షణం ఒక అమూల్యమయిన వరంగా అందించిన ఆనాటి క్షణాలు మళ్ళీ మన జీవితంలో ప్రవేశపెట్టు.

"మన మధ్య నెలకొన్న ఆనాటి ప్రేమానుబంధం తాత్కాలికం కానీకు."

'నీకోసం నేను నాకోసం నువ్వు' అనే భావనను చెరిగిపోనీకు. దానికి మళ్ళీ జీవం పోయి.

మనం ప్రారంభించిన ప్రేయసీ ప్రియుల అనుబంధం చివరివరకూ అలాగే నిలవనీ! దానిని మధ్యలో మార్చివెయ్యకు.

నేను భరించలేను రామ్!

నేను ఆ 'మధురమయిన' రోజుల్లోనే ఉండిపోయాను. నన్ను నిర్దాక్షిణ్యంగా బయటకు లాగకు. దయచేసి నువ్వా నా దగ్గరకొచ్చి నన్ను అదుకో.

నన్ను ఆనాటి లలితగానే మిగలనీ!

నువ్వు ఆనాటి శ్రీరామ్‌గా రూపొందు—

ఇంతే నేను కోరుకొనేది.

ఇదే నాక్కావలసింది — నీ — ఒకనాటి ప్రియురాలు." □